



కె.వి.సుమలత

# ఒకరికి ఒకరు

బెడ్‌రూమ్ గది నలువైపులా లైట్‌రోజ్ కలర్, రూఫ్ లైట్ స్కై బ్లూ కలర్ పెయింటింగ్స్‌తో చూడముచ్చటగా వుంది.

కిటికీ దగ్గర ఉన్న డబుల్ కాట్ బెడ్ పైన తెలుపుపై గులాబి రంగు పూల డిజైన్ ఉన్న బెడ్‌షీట్ వేసి ఉంది. గదిలో ఒక ప్రక్కగా డ్రెస్సింగ్ టేబుల్, దానిమీద హారతి, వివేక్‌ల ఫోటోఫ్రేమ్ ఉంది. మరోప్రక్క ఐరన్ సేఫ్, టి.వి.స్టాండ్ ఉన్నాయి. గది చాలా నీట్‌గా సర్దినట్లుగా వుంది.

గదంతా మల్లెపూల పరిమళం గాలిలో మత్తుగా ఒత్తిగిల్లుతోంది. అది మల్లెల సీజను కాదు. అయినా అంతటి సుగంధం ఎక్కడి నుండి వస్తోందో! చుట్టూ పరికించి చూసింది హారతి. ఎదురుగా ఉన్న షెల్ఫ్‌లో స్ప్రే కనిపించింది. సన్నగా హరిప్రసాద్ చౌరాసియా స్వర విన్యాసం వీనుల విందుగా వినిపిస్తోంది. హారతికి ఎంతో ఇష్టమైన మల్లెల పరిమళం, మధురమైన సంగీత స్వరం ఆమెను ఎంతగానో ఆహ్లాదపరుస్తున్నాయి.

'తమ ఇల్లంతా ఎంతగానో మారిపోయింది. హాల్లో ఉండాల్సిన టి.వి. రూమ్‌లోకి వచ్చింది. గదిలో ఉండాల్సిన కంప్యూటర్ హాల్లోకి మారిపోయింది. ఎన్నిసార్లో 'నిద్రపోనివ్వడం లేదు' అని వివేక్‌తో తను వాదులాడేది. అయినాసరే బెడ్‌రూమ్ నుండి కంప్యూటర్‌ని మార్చేసేవాడు కాదు. అలాంటిది ఇప్పుడు తను అడగకుండానే మార్చేసాడు...' ఇల్లంతా పరికించి చూస్తూ హారతి మనసులో అనుకుంటోంది.

చాలా కాలానికి ఇంటికి వచ్చిన హారతి హాయిగా ఊపిరి పీల్చుకుంది. అందులో అంతా తన మనసుకి నచ్చేవిధంగా ఏర్పాటుచేసిన వివేక్‌ని మనసులో మెచ్చుకుంటూ ఒకలాంటి తన్మయత్వానికి లోనవుతూ కళ్ళు మూసుకుంది హారతి.

నాసికాపుటాలకు పకోడీ వాసన వస్తుంటే కళ్ళు తెరిచింది హారతి. చెక్కిళ్ళమీద సున్నితంగా వీణ మీటినట్లుగా తాకి "వేడి వేడి పకోడీ రెడీ" అన్నాడు వివేక్.

"ఆహ్లాదకరమైన ఈ వాతావరణం చూస్తుంటేనే నా కడుపునిండినట్లుగా ఉంది వివేక్" అంది హారతి.

"అలాగే ఉంటుంది కానీ నిండదురా! లే లేచి కూర్చో" అంటూ పకోడీ తీసి హారతి నోట్లో పెట్టాడు.

మంత్రముగ్ధలా పకోడీ తినసాగింది హారతి. మొత్తం తినిపించాక ప్లేటు తీసుకొని కిచెన్‌లోకి వెళ్ళాడు. తిరిగి వచ్చేటప్పుడు ట్యాబ్లెట్స్, క్యాప్సుల్స్, చేతిలో మంచినీళ్ళ గ్లాసుతో వచ్చాడు.

"ఊ..నోరు తెరువు" అన్నాడు.

అతని మాటలలో ఏదో సమ్మోహనశక్తి ఉన్నట్లుగా మాట్లాడకుండా నోరు తెరిచింది. వివేక్ చేతిలోని మాత్రలు హారతి గొంతులోకి ఒకటొక్కటిగా వెళ్ళాయి.

"సరేనోయ్! ఇక కళ్ళు మూసుకొని నిద్రపో. నీకిష్టమైన గుత్తివంకాయ మసాలా కూర చేస్తాను. నీకన్నా బాగా చేసానో లేదో నీవే చెప్పాలి రుచి చూసాక" అంటూ కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తూ వెళ్ళాడు.

హారతికి వివేక్ కళ్ళంటే చాలా ఇష్టం. ఆ కళ్ళు చూడగానే సర్వం మరచిపోయి అనురాగాల లోగిళ్ళలో నడయాడుతున్న అనుభూతి. హారతి మంచంమీద వాలి కళ్ళు మూసుకుంది. ఆమె ఆలోచనలు కాలేజ్ రోజుల్లోకి పరుగులు తీసాయి.

ఇంజనీరింగ్‌లో హారతి, వివేక్ క్లాస్‌మేట్స్. వివేక్ చేతులు హారతికి రాసిన ప్రేమలేఖలకన్నా చూపులు రాసిన ప్రేమలేఖలే ఎక్కువ. అవి చదివి ఆమె పరవశించి పోయేది. హారతి అంగీకారానికి అట్టేకాలం పట్టలేదు. ఆ తరువాత ఇద్దరి మధ్యా ఎన్నెన్ని ప్రేమ జ్ఞాపకాలో! అలా అని ఇద్దరూ చదువుని నిర్లక్ష్యం చేయలేదు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌లో క్యాంపస్ సెలక్షన్స్‌లో ఇద్దరూ సెలక్టయ్యారు. ఆ తరువాత ఒకే కంపెనీలో ఒకేసారి చేరారు.

వివేక్ ప్రొజెక్ట్‌వర్కు కోసం ఫారిన్ టూర్‌కి వెళ్ళాడు. హారతి అదే కంపెనీలో ఉండిపోయింది. ఆరునెలల కోసం వెళ్ళిన వివేక్ ఏడాది వరకు అక్కడే ఉండిపోయాడు.

వివేక్ తిరిగి వచ్చాక హారతి ముందు రెండు ప్రతిపాదనలు ఉంచాడు. మొదటిది వారి వివాహం, రెండవది స్వంత కంపెనీ పెట్టుకోవడం. అన్ని అర్హతలున్న వివేక్‌ని అల్లుడిగా ఆమోదించడానికి హారతి తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పలేదు. అదే విధంగా హారతిని కోడలిగా ఆహ్వానించడానికి వివేక్ తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

పెద్దల సమక్షంలో వివేక్, హారతి దంపతులయ్యారు. వివేక్ మొదటి ప్రతిపాదన అమలు జరిగాక రెండవదయిన స్వంత కంపెనీ స్నేహితులతో కలిసి మొదలుపెట్టాడు.

స్వంత కంపెనీలోని వృత్తిజీవితం అడుగడుగునా లాభదాయకమైంది. కోరి చేసుకున్న వైవాహిక జీవితం అంతులేని ఆనందదాయకమైంది. రోజులు వడివడిగా దొర్లసాగాయి.

"ఇదుగో పోస్టింగ్ ఆర్డర్" అంటూ తమ స్వంత కంపెనీలోకి వచ్చేయమని వివేక్, హారతిని కోరాడు. సంతోషంగా అంగీకారం తెలిపింది హారతి.

"ఈరోజు నాకు చాలా ఆనందంగా వుంది. మన కంపెనీలోకి నీవు కూడా వస్తున్నందుకు నీకు పెద్దపార్టీ ఇస్తాను. సాయంత్రం తొందరగా వస్తాను రెడీగా ఉండు" అన్నాడు వివేక్.

అనుకున్నట్లుగానే సాయంకాలం స్టార్ హోటల్‌కి డిన్నర్‌కి వెళ్ళారు. చాలా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ పూర్తిచేసారు. ఇంటికి తిరిగి వస్తుండగా "నేను డ్రైవ్ చేస్తాను" అంటూ స్టీరింగ్ హారతి తీసుకుంది. హారతికి డ్రైవింగ్ చేయడమంటే చాలా యిష్టం. అందుకే వివేక్ అభ్యంతరం చెప్పలేదు.

ఊహించని రీతిలో హెవీలోడ్‌తో వస్తున్న లారీ కారుని ఢీకొంది. డ్రైవింగ్ సీట్‌లో ఉన్న హారతికి పెద్ద గాయాలయ్యాయి. వివేక్‌కి చిన్న దెబ్బలు తగిలాయి. చుట్టూ చేరిన జనం ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

హారతికి రక్తం చాలా పోవడంతో రక్తం ఎక్కించాలన్నారు. ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. ఆస్పత్రిలో హారతి గ్రూపు రక్తం దొరకలేదు. వేరే ఎక్కడినుండో ఆస్పత్రివర్గం రక్తం తెప్పించారు.

ఆ క్షణంలో డాక్టర్లకు ఆ రక్తం ఆమె ప్రాణం నిలుపుతుందనే అనుకున్నారు కానీ ఆమె జీవితాన్ని బలి తీసుకుంటుందని తెలియదు. రోజులు గడుస్తున్నా కోలుకోవలసిన హారతి ఆరోగ్యం రోజురోజుకీ క్షీణించసాగింది. బరువు తగ్గిపోయింది. వ్యాధి నిరోధకత తగ్గింది. మళ్ళీ అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు జరిగాయి. చివరకు హెచ్.ఐ.వి. అని నిర్ధారించారు.

విషయం విని హారతి ఆకులా అల్లాడిపోయింది. 'ఇందుకా నేను బ్రతికింది' అంటూ విలవిలలాడిపోయింది.

వివేక్ మ్రాన్పడిపోయినా అంతలోకే ధైర్యం తెచ్చుకొని నిలద్రొక్కుకున్నాడు. హారతికి ధైర్యం చెప్పాడు. అనునయించాడు. కంటికి రెప్పలాగా చూసుకున్నాడు. అతడు చూపిస్తున్న ఆప్యాయతకు హారతిలో ఉద్వేగం కట్టలు తెంచుకుంది. ముందస్తు సూచన లేని మబ్బుల్లా

ఆమె కళ్ళు వర్షించాయి.

"హారతీ, ఆ ఉద్వేగమే పనికిరాదు. మనసును స్వాధీనంలో ఉంచుకోవాలి. మానసిక ప్రశాంతత, విశ్రాంతి, పోషకాహారం, ఔషధాలు ప్రస్తుత పరిస్థితులలో నీకు అవసరమని డాక్టర్లు చెప్పారు. నీవు ఇలా బాధపడుతుంటే కోలుకోవడమెలా?" అర్థమయ్యేలాగా చెప్పాడు.

అతని సాంత్వనపు పలుకులకు ఆమె ఊరడింపబడినట్లుగా బాధను తగ్గించుకునే ప్రయత్నం చేసింది.

డాక్టర్ల సలహామేరకు హారతి కొంతకాలం ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది.

కోలుకున్నాక డిశ్చార్జ్ అయి ఇంటికి తిరిగి వచ్చిన హారతికి ఇంటి అలంకరణ అంతా సరిక్రొత్తగా తన మనసుకి నచ్చిన విధంగా ఉండటం కనిపించింది.


"శ్రీమతిగారూ! భోజనం చేద్దామా!" వివేక్ మాటలకు గతం తాలూకు ఆలోచనల నుండి వాస్తవానికి వచ్చింది.

వివేక్ చూపుతున్న శ్రద్ధకి, ఆపేక్షకి హారతి నిలువెల్లా కరిగిపోతోంది.

హారతికి హెచ్.ఐ.వి. అని తెలిసి చూడటానికి వచ్చిన బంధువులు ప్రవర్తించే తీరు, ముక్తసరి పలకరింపులు ఆమెను బాధించేవి. తనేదో చేయరాని తప్పు చేసి ప్రమాదకరమైన జబ్బు పాలయినట్లు, తన గాలి సోకితే వారికేదో అంటుకుంటున్నట్లు భావిస్తున్నట్లుగా ఉండేది. చేయని తప్పునకు శిక్ష అనుభవించే పరిస్థితికి గురయినందుకు హారతి కుమిలిపోయేది. వివేక్ హారతికి ఎన్నో రకాల అనునయ వాక్యాలతో ఆమెను ఓదార్చి కొండంత అండనిచ్చేవాడు. ఆరోగ్యం కుదుటపడిన తరువాత వివేక్ మాటలతో తిరిగి హారతి ఆఫీసుకి వెళ్ళసాగింది.

ఆఫీసులో కూడా గుప్పుమన్న ఈ వార్త ప్రభావం కనిపించిందామెకి. బాస్ భార్య కాబట్టి ఎదురుగా ఏమీ అనకపోయినా వారి చూపులు, మొహంలో కదలాడే భావాలు, వెనుకగా గుసగుసలు హారతి చెవినపడి చలించిపోయేది.

ఆరోగ్యసమస్య కంటే నా అనుకున్నవారు, సన్నిహితులు దూరంగా ఉంచడం, అవగాహనా రహితంగా ప్రవర్తించడం ఆమెను తీవ్రంగా బాధపెట్టేది. వివేక్ సాన్నిహిత్యంలో మరుగునపడిన అనారోగ్యం, చుట్టూ ఉన్న జనం వెలికితీసి ఎత్తిచూపించడం తట్టుకోలేకపోయేది.




వాటన్నింటినీ కొట్టిపారేసేవాడు వివేక్. ఇంటాబయటా అందరితో ఎదురయిన సమస్యలన్నింటినీ ఒంటిచేత్తో ఎదుర్కొన్నాడు. పరిస్థితికి ఎదురీది బ్రతకాలని హారతికి ధైర్యం చెప్పేవాడు.

'పిల్లలు లేని కాపురం వ్యర్థం' అని కుటుంబ సభ్యులు, బంధువర్గం పరోక్షంగా అనడం వినిపించిన హారతి వివేక్‌తో నాకు ఎటువంటి అభ్యంతరం లేదు, పిల్లల కోసమయినా మరో వివాహం చేసుకొమ్మని చెప్పింది.

ఆమె మాటలు పూర్తికాకుండానే "నాలుగు సంవత్సరాల మన ప్రేమ, మూడు ముళ్ళబంధం విలువ ఇంతేనా? నాకంటే వాటి గురించి నీకే ఎక్కువ తెలుసనుకున్నా. నీకు ధైర్యం, వివేకం ఎక్కువనుకుని సంబరపడ్డాను. అలా ఇంకెప్పుడూ మాట్లాడకు. నీకు ఏర్పడిన ఇబ్బంది, కష్టం నాది కూడా. నాకు నీవు, నీకు నేను. పిల్లల కోసమయితే వేరే పెళ్ళి చేసుకోవలసిన అవసరం లేదు. కావాలనుకుంటే మనకు ఎంతోమంది పిల్లలు" అంటూ భుజం తట్టాడు.

మరికొద్దిరోజులలో ముద్దులు మూటగట్టే రెండు సంవత్సరాల పాపతో ఇంటికి వచ్చాడు వివేక్. పాపను చూడగానే హారతిలోని మాతృహృదయం పరవశించింది. ఆప్యాయంగా చేయి చాపగానే హత్తుకుపోయింది పాప. ఆ పసిదానిది ఎవరూ లేని నేపథ్యం.

"ఈరోజు నుండి మనం ముగ్గురం...ఈ పాప మన కంటిపాప" అంటూ ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాడు.

వివేక్ కళ్ళలోని వెలుగు చూస్తుంటే హారతిలో ఏదో ఉత్సాహం. జీవితంపై ఎదురులేని ఆశావహదృక్పథం.

○